కథానిక

# పిల్లల తల్లి

అవసరాల రామకృష్ణారావు

"ఏష్ట పిల్లలా? నన్ను ఏడిపించడానికి పుట్టిన రాక్షసులుగాని!" అనుకుంది అనసూయ అక్కయ్య. అక్కయ్యకు యిద్దరు పిల్లలుపుట్టినా చిన్నతనం వదల్లేదు' అంటుంది అమ్మ. అయినా వాళ్ళూ చిన్నవయినవాళ్లు కారు. బొజ్జికి అయిదో ఏడు. పాపాయికి మూడేళ్లు వెళ్ళాయనుకుంటాను. వీళ్లిద్దరితోనూ విసుక్కోని రోజు లేదు మా అనసూయ అక్కయ్య.

"పుణ్యంకొద్దీ పురుషుడూ, దానంకొద్దీ బిడ్డాను ఏ పాపం చేసుకున్నానో యిద్దరూ యిద్దరే" అంటుంది అక్కయ్య.

"కోతికి కొబ్బరికాయ దొరికినట్టు నీకు పిల్లలేమిటి? పిల్లల్ని పెంచడమంటే మాటలా?" అంటుంది అమ్మ.

మళ్ళీ పిల్లలిద్దరూ ఎంతో చక్కగావుంటారు మా బంధువుల్లో యిటూఅటూ అంత అందమయినవాళ్ళు లేరు. మా అక్కయ్య ఎందుచేతో వాళ్ళతో వేగలేదు. అమ్మమాట రైటో అక్కయ్య మాట రైటో నాకూ తెలీదు. ఇంతకీ అక్కయ్య ఆ వేళ అంతలా విసుక్కోడానికి కారణం-అదీ, నేనూ కలిసి సినిమా కెడదామనుకున్నాం. బావ ఏదో పల్లెటూరిలో పనిచేస్తున్నాడు. అక్కడ సినిమాలులేవు. అందుకని ఎప్పుడయినా మా వూరు వచ్చినపుడు అక్కయ్య సినిమాకి వెళదామని సరదా పడుతూంటుంది. "ఎక్కడయినా లోకం సాటిఉంటే బాగానేఉణ్ణు! 'ఊరందరిదీ ఒకదారిఅయితే ఉలిసికట్టె దొకదారి' అన్నట్టు ఆయన పంథా ఆయనిదే-లోకంలో ఎవరైనా పెళ్ళాన్ని తీసుకుని సినిమాకి వెళ్ళడానికి సరదా పడతారు. పదిమంది భట్రాజుల్ని వెంటబెట్టుకుని పదిరూపాయలు ఖర్చుపెడితేగాని యీయన ముచ్చట తీరదు. చెప్పుకుంటే సిగ్గుచేటు. ఇదెక్కడి మనిషమ్మా? పోనీ అలా లేదన్నవాళ్ళు యింట్లో ఉండి పిల్లల్ని చూస్తారు. అయ్యో రాత. అంత అదృష్టమూ?" అంటుంది అనసూయ అక్కయ్య. నిజమే, బావ అలాంటివాడే. నా సంగతి నేను చెప్పుకోవద్దూ? అమ్మా నాన్నా నన్ను ఒక్కణ్ణే అయితే సినిమాకు పంపరు. అందుకనే ఎవరైనా వచ్చేసరికి సినిమాను వర్ణించి లేవదీస్తూంటాను. ఆవాళా అలాగే అయింది. పనిచేసే పిల్లనీ, వంటమనిషి సుబ్బమ్మగారినీ బ్రతిమాలుకుని ఉయ్యాలకట్టి, పాలు, బిస్కట్లు పిప్పరమెంట్లు-యిన్ని సిద్ధంచేసి సినిమాకు బ్రహ్మ ప్రయత్నంతో బయలుదేరుతూంటుంది అక్కయ్య.

"పోనీ వీళ్ళను తీసుకెళ్లకూడదూ?" అన్నారు ఒకరు ఆమధ్య.

"ఈ మేళతాళాలతో బయలుదేరడానికి ఇదేం పెళ్ళిపిలుపు గనుకనా? వీళ్ళుంటే వేరే డోలూ, సన్నాయీ దేనికి?" అంటుంది అక్కయ్య.

నిజమే. వీళ్ళతో వెడితే ఓసారి మేంపడ్డ అవస్థలు యిన్నీ అన్నీ కావు. చూసినంతసేపు సినిమా చూస్తూ పెద్దగొంతుకలో విమర్శలు. "అదిగోనే అమ్మా ఏనుగ! హాయ్‌హాయ్ ఆ పాపాయి ఎంత బాగుందో!" ఇలాగ పెద్దకబుర్లు. అదైనాపూర్తిగా చూస్తారా? పావుగంట అవగానే ఆవులింతలూ, విరుచుకుపడిపోడాలూ.

"అమ్మా, ఏదో కుడుతోంది, గోకవే!" అంటాడు బొజ్జి. సినిమాచూడ్డంలో యీ మాట వినిపించుకోపోతే "గోకు,గోకు"అని పెద్ద కేకలు. అక్కయ్య ఒళ్లుమండి బకిరేస్తుంది. దాంతో "బాబోయ్"అని అనుపల్లవి. పకోడీలూ, సోడా కొనిపెట్టలేదని పాపాయి స్వరమేళవింపు. వేరే ఆలిండియా రేడియో నేషనల్ ప్రోగ్రాం ట్యూన్ చెయ్యక్కరలేదు.

"ఏమిటమ్మా ఆ ఏడుపు? కాస్త అవతలికి తీసుకెడుదూ! అయినా యీ పిల్లల్ని తీసుకు సిని

**ఆంధ్ర బ్యాంక్ లిమిటెడ్,**

స్థాపితము : : 1923

హెడ్డాఫీసు : మచిలీపట్టణము

చెల్లింపబడిన మూలధనము, రిజర్వులు :

రూ. 36,73,500/-

ఆమలులోనున్న వ్యాపారము మొత్తం రు. 6 కోట్లకు మించినది.

మద్రాసు శాఖలు :

ఎస్ప్లనేడ్, త్యాగరాయనగర్, మైలాపూర్

ఇతర బ్రాంచీలు, సబ్ ఆఫీసులు

---

ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా), అమలాపురం, అనకాపల్లి, అనంతపూర్, అరండల్ పేట (గుంటూరు), బాపట్ల, బళ్లారి, భీమవరం, చల్లపల్లి, చీరాల, కడప, దుగ్గిరాల, ఏలూరు, గొల్లప్రోలు, గవర్నరుపేట (విజయవాడ), గుడివాడ, గూడూరు(నెల్లూరు జిల్లా), గుంటూరు, ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), జగ్గయ్యపేట, కాకినాడ, కర్నూలు, మహారాణిపేట (విశాఖపట్నం), మచిలీపట్నం, నరసన్నపేట (శ్రీకాకుళం జిల్లా), నరసరావుపేట, నెల్లూరు, ఒంగోలు, పాలకొల్లు, పార్వతీపురం, పెడన (కృష్ణాజిల్లా), పెద్దాపురం, పిఠాపురం, రాజమండ్రి, రామారావుపేట (కాకినాడ), సాలూరు, సామర్లకోట, శ్రీకాకుళం, తెనాలి, తిరుపతి, తుని, విజయవాడ, వినుకొండ, విశాఖపట్నం, విజయనగరం, నిడదవోలు, గాంధీనగర్ (విజయవాడ).

అన్నిరకముల బ్యాంకింగు వ్యాపారములు చేయుబడును.

తాడేపల్లి శ్రీరాములు,
మేనేజింగు డైరెక్టర్.

**ఏలేశ్వరపు రామచంద్రమూర్తి,**
ఎం. ఏ., సి. ఎ. ఐ. ఐ. బి.,
జనరల్ మేనేజర్.

మాకు ఎలాసిద్ధపడ్డావమ్మా?" మొగాళ్ళలోంచి కేకలు. అసలుకన్న వడ్డీ ఎక్కువయినట్టు పిల్లల ఏడుపులుకన్న విమర్శలూ వెక్కిరింతలూ ఎక్కువైపోతాయి.

"పదండర్రా! పదండి. నా బుద్ధితక్కువకాని ఈ అమ్మశక్తుల్ని కూడాతీసుకుని సినిమాకుబయలుదేరడమేమిటి? 'కోతిముండకైనా గీత బాగుండాలి'నా ఖర్మం! పదండి." మా అక్కయ్యపిల్లలు ఏడ్చారన్నదానికన్నా విమర్శలకు ఎక్కువ అభిమానపడి కళ్ళనీళ్ళపర్యంతమై యింటికి చక్కావచ్చి పిల్లల్ని బాదేస్తుంది. ఈ కోపమంతా మా బావమీద తీర్చుకుంటుంది. ఆ రాత్రి వీళ్ళ పడకగదిపక్క మంచంవేసుకుంటే నిద్రపడ్డడం కష్టమే.

* • *

ఇంతకీ ఆవాళ ఏం జరిగిందని అడగరేం? చెప్తా వినండి.

అక్కయ్యా నేనూ యథాప్రకారంగా సినిమాకు బయలుదేరాం. సాయంకాలం అయిదు గంటలకే అక్కయ్యా నేనూ తయారయిపోయాం. అమ్మా నాన్నా పిల్లల్ని చూస్తామన్నారు. వీళ్లుగాక పిల్లా, సుబ్బమ్మా ఆ నాటికి పడుకుంటామన్నారు. బొజ్జి పక్కగ్రౌండులో ఆడుకుంటున్నవాడు ఎప్పుడువచ్చేశాడో మేమూ భోజనాలకు కూర్చోగానే సిద్ధమయిపోయాడు.

"అమ్మా, అమ్మా, నేనూ సినిమాకు వస్తానే!"

అక్కయ్యగుండెల్లో రాయిపడింది.

"ఇప్పుడు మేం సినిమాకు వెళుతున్నామని ఎవరు చెప్పేర్రా?" అన్నాను నేను.

"మరెందుకూ, అప్పుడే బువ్వతింటున్నారు?" కుర్ర వెధవలకి యింత జ్ఞాపకశక్తి పెద్దవాళ్ళ నేడిపించడానికే పెట్టేడు కాబోలు. గంటసేపు బ్రతిమాలగా ఒకరూపాయి వాడిచేతిలో పెట్టేటందుకూ, వాడి కిష్టమయిన ఓవల్టీనూ పంచదారా కలిపినగుండ వాడికిచ్చేటందుకూ, వాడికి నిద్ర వచ్చేవరకూ "చెవులపిల్లీ—నక్కా" కథ అమ్మమ్మ చెప్పేటందుకూ, ఈ షరతులమీద వాడు మమ్మల్ని వెళ్లనిస్తానన్నాడు. బ్రతుకు జీవుడా అనుకున్నాము నేనూ అక్కయ్యా. "అడుగులో పిడుగుపడ్డట్టు" వీధి తలుపు తియ్యగానే పాపాయి నెత్తుకుని పనిచేసే పిల్ల!

"ఏమే దరిద్రగొట్టు ముండా! ఇంకోగంట

పోయేవరకూ పాపాయిని తీసుకురా వద్దన్నాను గదా, అప్పుడే ఊరేట్టుకున్నావేమే?"

"దాన్ని తీసుకు వెడతారుగదా అని వెధవ ముండ!" దానికి రెండు తగల్నిచ్చారు.

"ఎక్కడికే అమ్మా?" అంది పాపాయి.

"నీకంటపడ్డ తరవాత యింకెక్కడికి నా తల్లీ? పదరా పద—లోపలికి పద." అక్కయ్యా నేనూ లోపలికి వచ్చేశాము. మాఅమ్మ కోప్పడింది.

"అంతట్లో అంత యిదై పోతావేమిటి అనసూ! గడీగడీకి విసుక్కుంటే పిల్లలతో అవుతుందా? నే చెప్తానుండు. చూడమ్మా, పాపాయీ అమ్మకి వంట్లో బాగులేదు. వాళ్లు ఆస్పత్రికి వెడుతున్నారు. నాకేం? అక్కడ సూదితో పొడిచేస్తారు! నీ యిష్టమైతే వెళ్లు."

బొజ్జిని ఎలాగైనా ఒప్పించవచ్చుగాని యీ "దండు మరాటీ"ని వదుల్చుకోడం మన తరం కాదు. అది రాదుట, సరే బాగుంది. కాని అమ్మని సూదితో పొడిచెయ్యడానికి వల్లకాదుట. వెళ్ళొద్దని "హోరున వర్షం కురిసినట్టు" భోరున ఏడుపు.

"అనసూ, యింక చెప్పి లాభంలేదు. మీరు వెళ్లండి. ఎంతసేపు ఏడుస్తుంది? అదే ఊరుకొంటుంది" అమ్మ పాపాయిని గట్టిగా పట్టుకుంది. మేమిద్దరం బండిలో కూర్చున్నాం.

*　　*　　*

"తమ్ముడూ, ఇప్పుడు టైమెంతవుతుందిరా?" అంది అక్కయ్య సినిమాకు వెళ్ళినకొద్దిసేపటిలోనే పక్కవాచీలో టైముచూసి నేను చెప్పేను.

"ఇప్పుడు బొజ్జికి పాలవేళకదా, పాలు ఎవరు కలిపి యిస్తార్రా?"

"అమ్మమ్మ యిస్తుంది లేవే-చెప్పేవుగా?"

"అమ్మమ్మకి ఊఁ నిద్దర! ఇవ్వకపోతే? వెర్రి వెధవ ఏడుస్తాడేమోరా?"

"అబ్బా! సినిమా చూడక ఏమిటా మాటలు? ఊరుకుందూ."

అక్కయ్య కొంతసేపు ఊరుకుని మళ్లీ అడిగింది.

"ఒరే తమ్ముడూ? పాపాయి ఊరుకుందం దంటావుట్రా?"

సినిమాలో ఓ చోట 'జూ' చూపించారు.

"అయ్యో, జంతువులంటే బొజ్జికి యెంత సరదా. వాడ్ని తీసుకువస్తే ఎంతో బాగుండును!"

"అదేమిటే అక్కా, క్రిందటిసారి వాళ్ళని తీసుకొచ్చాం. చాలదూ?"

"పోనిద్దూ ఒరే. కుర్ర వెధవలు అల్లరిచేస్తే చేస్తారు. వాళ్ళ తరవాతే మనం. వాళ్ళనొదిలేసి మనం తయారవడం నాకేం నచ్చలేదు."

అక్కయ్య ఎందుకలా మారిపోయిందో నాకేం అర్థమవలేదు.

"అదేమిటే? ఇంత సరదాపడీ, చచ్చి చెడి వాళ్ళను ఒప్పించివస్తే వచ్చిన దగ్గర్నుంచీ వాళ్ళ ధ్యాసే పట్టుకుంది నీకు?"

అక్కయ్య మాటాడలేదు. ఏదో ఆలోచిస్తోంది.

"సినిమా అయినా చూడవేమిటే? మరి ఇంత ప్రయత్నమూ చేసుకుని దేనికే వస్తా? ఇంగ్లీషువాళ్ళు ఎంతో అదృష్టవంతులు. పిల్లల్ని కొన్నేళ్ల వరకూ ఎక్కడికో పంపించేస్తారు అన్నావుకదుటే నువ్వు? మరి ఒక్కగడీకే అలా ఇదైపోతున్నావేమిటే?"

సినిమా షోకస్‌లో అక్కయ్య కళ్ళల్లో నీళ్లు మిలమిలా మెరిశాయి.

"వాళ్ళలో మానవత్వం ఉందో లేదో నాకు తెలీదు. నేను మాత్రం బొజ్జినీ, పాపాయినీ ఐదు నిముషాలు వదల్లేను. వాళ్ళని కష్టపెట్టి ఏసుఖం అనుభవించలేను. నే సినిమా చూడలేనురా తమ్ముడూ" అక్కయ్య లేచి నిలబడిపోయింది. నాకు ఎంత ఒళ్ళు మండిందో చెప్పలేను. ఏం చెయ్యను! విసుక్కుంటూ వచ్చేశాను. ఇంటికి రాగానే అక్కయ్య పిల్లలిద్దరినీ ముద్దుపెట్టుకొని "వీళ్లు పిల్లలా? నన్ను ఉద్ధరించడానకి పుట్టిన దేవతలు గాని!" అంది. అక్కయ్య సినిమానుంచి ఎందుకు వచ్చేసిందో అలా ఎందుకందో నా తల బద్దలు కొట్టుకున్నా అర్థంకాలేదు!

జడ్జి: కిందటి ఎన్నికల్లో నువ్వు మూడుసార్లు వోటుచేసినట్లు ఆరోపణ. ఏమంటావ్?
నేరస్థుడు: అయితే దగా పడిపోయానండి. ఒక్కవోటుకే నాకు డబ్బిచ్చారు.